ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రాజకీయాలకు గౌతమ్ గంభీర్ గుడ్‌బై

2లో..

సంపుటి: 1 | సంచిక: 328 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 3 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

### మరో గ్యారెంటీ అమలుకు ముహూర్తం ఖరారు

### మార్గదర్శకాలు జారీ చేయాలని సీఎం ఆదేశం

హైదరాబాద్, మార్చి 2 (ప్రభాత ఉదయం): ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే మరో పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మార్చి 11న ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. సొంత ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ గృహనిర్మాణ పథకం లబ్ధిని వర్తింపజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ మొదట ప్రాధాన్యమివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణం కోసం నిధులను ఏ దశలో, ఎన్ని విడతలుగా విడుదల చేయాలనే నిబంధనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయాలని తాత్కాలిక నిర్ణయం తీసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇప్పటికే ..మిగతా 2లో

### 195 మంది లోక్‌సభ అభ్యర్థులతో బీజేపీ

# తొలి జాబితా

### వారణాసి నుంచి ప్రధాని మోదీ.. గాంధీనగర్ నుంచి అమిత్ షా

### మొత్తం 34 మంది కేంద్రమంత్రులకు తొలి జాబితాలో చోటు

2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి భారతీయ జనతా పార్టీ మొదటి జాబితాను విడుదల చేసింది. 195 నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించింది. ఇందులో మరోసారి వారణాసి నుంచి ప్రధాని మోదీ పోటీ చేయనున్నారు. ఇక గాంధీ నగర్ నుంచి మరోసారి కేంద్రమంత్రి అమిత్ షా బరిలో ఉండనున్నారు. మొత్తం 34 మంది కేంద్రమంత్రులకు తొలి జాబితాలో చోటు దక్కింది. తెలంగాణలో 9 స్థానాలకు అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది.



న్యూఢిల్లీ, మార్చి 2 (ప్రభాత ఉదయం): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. 2024 ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేయనున్న తొలి జాబితాను పార్టీ విడుదల చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి వారణాసి నుంచి బరిలో ఉంటారని స్పష్టం చేసింది. ఇక తొలి జాబితాలో మొత్తం 195 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో 34 మంది కేంద్రమంత్రులకు మరోసారి అవకాశం కల్పించింది. బీజేపీ విడుదల చేసిన ఫస్ట్ లిస్ట్‌లో 28 మంది ..మిగతా 2లో



## తెలంగాణలో భాజపా లోక్‌సభ అభ్యర్థులు

లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను భాజపా విడుదల చేసింది. మొత్తం 195 స్థానాలకుగానూ పోటీదారుల పేర్లు ప్రకటించింది. ఇందులో తెలంగాణ నుంచి 9 మందిని అధిష్ఠానం ఎంపిక చేసింది. గత లోక్ సభ ఎన్నికల్లో ఆదిలాబాద్, కరీంనగర్, సికింద్రాబాద్, నిజామాబాద్ స్థానాల్లో గెలుపొందగా.. అందులో ముగ్గురు సిట్టింగ్‌లకు మరోసారి అవకాశం కల్పించారు.ఆదిలాబాద్ నుంచి సోయం బాపూరావుకు తొలిజాబితాలో అవకాశం లభించలేదు.సికింద్రాబాద్ -కిషన్ రెడ్డి (కేంద్రమంత్రి),కరీంనగర్ - బండి సంజయ్, నిజామాబాద్ డి.అర్వింద్,చేవెళ్ల - కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మల్కాజిగిరి ఈటల రాజేందర్, జహీరాబాద్-బీబీ పాటిల్, హైదరాబాద్ -మాధవీలత, నాగర్ కర్నూల్ - భరత్ ప్రసాద్, భువనగిరి-బూర నర్సయ్యగౌడ్ తదితరులను ప్రకటించింది.

## ఖర్గేకు గడ్కరీ లీగల్ నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 2 (ప్రభాత ఉదయం): మల్లికార్జున్ ఖర్గేకు నితిన్ గడ్కరీ లీగల్ నోటీసు పంపారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ఇంటర్వ్యూలో ..మిగతా 2లో



## టీఎంసీ అంటేనే అవినీతి

కోల్‌కతా, మార్చి 2 (ప్రభాత ఉదయం): పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతిపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విమర్శలు చేశారు. బెంగాల్‌లో మొత్తం 42 సిట్లతో బీజేపీ విజయం సాధించాలనే లక్ష్యంతో టీఎంసీని ప్రధాని మోదీ టార్గెట్ చేశారు. ఆయన శనివారం బెంగాల్‌లోని కృష్ణానగర్‌లో ..మిగతా 2లో



## టీఎస్ఆర్టీసీకి అవార్డుల పంట

హైదరాబాద్, మార్చి 2 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)కు అవార్డుల పంట పడింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ నుంచి టీఎస్ఆర్టీసీకి ఐదు అవార్డులు దక్కాయి. 2022-23 సంవత్సరానికి TSRTC కి రహదారి భద్రత, సమర్థవంతమైన ఇంధన నిర్వహణ, ఉద్యోగుల భద్రత, సాంకేతిక సామర్థ్య విభాగాలలో అవార్డులు దక్కాయి. ఈ ఐదింటిలో రోడ్డు భద్రత విభాగంలో ప్రథమ బహుమతి, గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన సామర్థ్య నిర్వహణ విభాగంలో ప్రథమ, అర్బన్ విభాగంలో ద్వితీయ, ఉద్యోగుల సంక్షేమం, మెరుగైన ప్రయాణ అనుభవం కోసం సాంకేతికతను ఉపయోగించడంలో మొదటి బహుమతి లభించింది . ఈ నెల 15న ఢిల్లీలో అవార్డులను అందజేయనున్నట్టు ఏఎస్ఆర్‌టీయూ ప్రకటించింది. కాగా, వివిధ విభాగాల్లో టీఎస్ఆర్టీసీ ఐదు అవార్డులు గెలుచుకోవడంపై రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేశారు. కార్పోరేషన్ సిబ్బంది కృషి, అంకితభావానికి ..మిగతా 2లో



## జీహెచ్ఎంసీ ప్రక్షాళన

### 14 మంది అధికారులపై వేటు

హైదరాబాద్, మార్చి 2(ప్రభాత ఉదయం) జీహెచ్ఎంసీలో అధికారుల ప్రక్షాళన మొదలైంది. రిటైర్డ్ ఉద్యోగులపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను కమిషనర్ టర్మినెట్ చేశారు. 45 మంది రిటైర్డ్ ఉద్యోగుల్లో 37 మంది తమ విధుల నుంచి వైదొలిగారు. అక్రమాలకు పాల్పడిన 14 మంది అధికారులను విధుల నుంచి కమిషనర్ తొలగించారు. తప్పులు చేస్తున్న పలువురు అధికారులకు రోనాల్డ్ రోస్ మెమోలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. కాగా, అక్రమాల కట్టడి కోసం ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని ..మిగతా 2లో

### డిపాజిటర్స్‌లో విశ్వాసం నెలకొల్పుటలో ఆధునీకరణ దిశగా

## అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు

### కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ నిర్ణయం

### వివరాలు వెల్లడించిన రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ఎస్. ఎల్. ఎన్. టి. శ్రీనివాస్

న్యూఢిల్లీ, మార్చి 2(ప్రభాత ఉదయం) అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్‌ల కోసం అను సంధాన సంస్థ నేషనల్ అర్బన్ కోఆపరేటివ్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ యూ సీ ఎఫ్ డీ సీ )ను కేంద్ర హోం మంత్రి , సహకార మంత్రి అమిత్ షా ప్రారంభించారు.స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకార శాఖకు కొత్త ఊపిరి పోస్తూ ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. సహకార మంత్రిత్వ శాఖ రూపంలో సహకార ఉద్యమానికి గొడుగు పట్టిందని ఆయన పేర్కొన్నారు. 125 సంవత్సరాలుగా సహకార రంగం పోరాడి తన ఉనికిని కాపాడుకుందని కానీ ఇప్పుడు ప్రభుత్వ వ్యవస్థ మద్దతుతో అది వేగంగా అభివృద్ధి చెందుతుందని , దేశ ఆర్థిక వ్యవస్థలో గౌరవాన్ని సాధిస్తుందని షా తెలిపారు. సహకార ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నగరంలో అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల ఏర్పాటు లక్ష్యం కావాలని అమిత్ షా అన్నారు. ఎన్ యూ సీ ఎఫ్ డీ సీ ఏర్పాటుతో దేశంలో అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల ..మిగతా 2లో



సర్టిఫికెట్ అందజేస్తున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా

# 195 మంది లోక్‌సభ అభ్యర్థులతో బీజేపీ
# తొలి జాబితా

మొదటి పేజీ తరువాయి...

మహిళలకు స్థానం ఇచ్చారు. యువతకు 47 సీట్లు, ఎస్సీలకు 27 స్థానాలు, ఎస్టీలకు 18 సీట్లు కేటాయించారు. ఇక ఓబీసీలకు 57 నియోజకవర్గాల్లో అవకాశం కల్పించారు. పశ్చిమ బెంగాల్ నుంచి 20 మంది, మధ్యప్రదేశ్ నుంచి 24 మంది, గుజరాత్ నుంచి 15 మంది, రాజస్థాన్ నుంచి 15 మంది, కేరళ నుంచి 12 మందికి తొలి జాబితాలో అవకాశం కల్పించారు. గుజరాత్‌లోని గాంధీ నగర్ నుంచి కేంద్రమంత్రి అమిత్ షా మరోసారి బరిలోకి దిగనున్నారు. యూపీలోని లక్నో నుంచి మరో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పోటీలో నిలిచారు. మధ్యప్రదేశ్‌లోని గుణ స్థానం నుంచి జ్యోతిరాదిత్య సింధియా పోటీలో ఉండనున్నారు. దిబ్రూఘడ్ నుంచి శర్బానంద సోనోవాల్, అరుణాచల్ ప్రదేశ్ నుంచి కిరణ్ రిజిజు, రాజ్‌కోట్ నుంచి పురుషోత్తమ్ రూపాలా, ఉదంపూర్ నుంచి జితేంద్ర సింగ్, గొడ్డా నుంచి నిషికాంత్ దూబే, కుంటి నుంచి అర్జున్ ముండా, త్రిస్సూర్ నుంచి సినీ నటుడు సురేష్ గోపి, పథనం తిట్ట అనిల్ ఆంటోనీలకు అవకాశం కల్పించారు.



మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌ను విదిశ నుంచి లోక్‌సభ బరిలో నిలిపారు. కేంద్రమంత్రులు వీ మురళీధరణ్ అట్టింగల్ నుంచి.. రాజీవ్ చంద్రశేఖర్ తిరువనంతపురం నుంచి బరిలోకి దిగనున్నారు. ఢిల్లీలోని ఉత్తర ఢిల్లీ మనోజ్ తివారీ, న్యూఢిల్లీ నియోజక వర్గంలో సుష్మా స్వరాజ్ కుమార్తె బన్సూరి స్వరాజ్, వెస్ట్ ఢిల్లీ కమాల్‌జీత్ సెహ్రావత్, సౌత్ ఢిల్లీ రమ్‌వీర్ సింగ్ బిధురి, ఢిల్లీ చాందినీ చౌక్ నుంచి ప్రవీణ్ ఖండేల్వాల్‌లకు అవకాశం కల్పించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ స్థానాన్ని అలోక్ శర్మకు ఇచ్చారు. ఈ స్థానంలో సిట్టింగ్ ఎంపీగా ఉన్న వివాదాస్పద బీజేపీ నేత సాధ్వీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్‌కు బీజేపీ హై కమాండ్ మొండి చేయి చూపించింది. ఇక ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథీ నుంచి కేంద్రమంత్రి స్మృతి ఇరానీ మరోసారి బరిలోకి దిగనున్నారు. రాష్ట్రాల వారీగా చూస్తే పశ్చిమ బెంగాల్ నుంచి 27, మధ్యప్రదేశ్ నుంచి 24, గుజరాత్ నుంచి 15, రాజస్థాన్ నుంచి 15, కేరళ నుంచి 12, ఛత్తీస్‌గడ్ నుంచి 12, జారండ్ నుంచి 11, తెలంగాణ నుంచి 9, ఢిల్లీ నుంచి 5, జమ్మూ కాశ్మీర్ నుంచి 2, ఉత్తరాఖండ్ నుంచి 3, అరుణాచల్ ప్రదేశ్ నుంచి 2, గోవా నుంచి ఒకరు, త్రిపుర నుంచి ఒకరు, అండమాన్ నికోబార్ నుంచి ఒకరు, దమన్ అండ్ దీవ్ నుంచి ఒకరు అభ్యర్థులను పోటీలో నిలిపింది.

## ఖర్గేకు గడ్కరీ లీగల్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి...

కొంత భాగాన్ని పోస్ట్ చేసినందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు చిక్కుల్లో పడ్డారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్‌లకు గడ్కరీ లీగల్ నోటీసులు పంపారు. సోషల్ మీడియాలో నితిన్ గడ్కరీ తప్పుదోవ పట్టించే వీడియోను షేర్ చేసినందుకు ఈ లీగల్ నోటీసు జారీ చేయబడింది. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం దేశంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ నోటీసు ద్వారా రాజకీయ లబ్ధి కోసం తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రవర్తనను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మహారాష్ట్ర బీజేపీ నోటీసులో పేర్కొంది. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ 'ది లాలాంటోప్'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూ యొక్క 19 సెకన్ల క్లిప్‌ను కాంగ్రెస్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలో, నితిన్ గడ్కరీ ఈ రోజు గ్రామంలోని పేదలు, కూలీలు, రైతులు విచారంగా ఉన్నారని చెప్పారు. ఈ క్లిప్‌లో, గ్రామానికి మంచి రోడ్లు, స్వచ్ఛమైన తాగునీరు, మంచి ఆసుపత్రులు, మంచి పాఠశాలలు లేనందుకు బాధగా ఉందని గడ్కరీ చెప్పారు. బీజేపీని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. క్యాప్షన్ రాసింది, 'మోదీ ప్రభుత్వ మంత్రులు, నేడు రైతులు తమ పంటలకు ధర లభించడం లేదని చెప్పారు. మోదీ ప్రభుత్వంలో గ్రామాలు, గిరిజన ప్రాంతాలు ఇబ్బందుల్లో ఉన్నాయి.' సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలో, గ్రామ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి కనీస సౌకర్యాల కొరత గురించి గడ్కరీ మాట్లాడటం కనిపిస్తుంది. అయితే, కాంగ్రెస్ షేర్ చేసిన కొన్ని సెకన్ల వీడియో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. 'ది లాన్‌టాప్' నుండి నితిన్ గడ్కరీతో ఈ పూర్తి ఇంటర్వ్యూ 1 గంట 42 నిమిషాల నిడివితో ఉంది. అయితే, పాక్షిక వీడియోను షేర్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని బీజేపీ ఆరోపించింది.

## రాజకీయాలకు గౌతమ్ గంభీర్ గుడ్‌బై

న్యూఢిల్లీ, మార్చి 2 (ప్రభాత ఉదయం): మాజీ క్రికెటర్, బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగాలని ఆయన సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాజకీయ విధుల నుంచి తప్పించాలని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను గౌతమ్ గంభీర్ కోరారు. దీనికి సంబంధించి ఆయన సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. గౌతమ్ గంభీర్ 2019 మార్చి నెలలో బీజేపీలో చేరారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గౌతమ్ గంభీర్‌కు బీజేపీ టికెట్ దక్కే అవకాశం లేదని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవాలని గంభీర్ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. క్రికెట్‌కు సంబంధించిన బాధ్యతలపై దృష్టిసారించాల్సి ఉన్నందున.. రాజకీయ విధుల నుంచి తప్పించాలని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కోరినట్లు గంభీర్ తెలిపారు. ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయాల నుంచి తప్పుకోవాలన్న గంభీర్ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారుతోంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా ఒకట్రెండు రోజుల్లో విడుదలయ్యే అవకాశముంది. అభ్యర్థుల ఖరారుకు సంబంధించి బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ రెండ్రోజుల క్రితం ఢిల్లీలో సమావేశమై సుదీర్ఘంగా చర్చించింది. ఈ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు 100 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను బీజేపీ ఏ క్షణంలోనైనా విడుదల చేసే అవకాశముంది. తొలి జాబితాలోనే ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా తదితరుల పేర్లు ఉండే అవకాశముంది.

## టీఎస్ఆర్టీసీకి అవార్డుల పంట

మొదటి పేజీ తరువాయి...

అద్దం పడుతూ ఈ విజయం సాధించిందని, టీఎస్ఆర్టీసీ సిబ్బందికి, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. మేనేజింగ్ డైరెక్ట్ సజ్జనార్ కూడా కార్పొరేషన్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. యావత్ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ప్రయాణికులకు అత్యుత్తమ సేవలందించడంలో సిబ్బంది నిర్విరామ కృషికి ఈ అవార్డులు నిదర్శనమని అన్నారు.

## జీహెచ్ఎంసీ ప్రక్షాళన

మొదటి పేజీ తరువాయి...

జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం పారిశుధ్య కార్మికులతో పాటు ఇతరుల హాజరుకు వినియోగిస్తున్న ఫింగర్ ప్రింట్స్ బయోమెట్రిక్ స్థానే ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత ఫేషియల్ రికగినషన్ బయోమెట్రిక్‌ను ఉపయోగించేందుకు సిద్ధమైంది. తద్వారా బోగస్ కార్మికులకు అడ్డుకట్ట వేయవచ్చని, ఫలితంగా ఏటా కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం కాకుండా నివారించవచ్చునని భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం ఈ విధానాన్ని అమలు చేస్తుండటంతో జీహెచ్ఎంసీ కూడా రెడీ అయ్యింది.

## టీఎంసీ అంటేనే అవినీతి

మొదటి పేజీ తరువాయి...

ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. 'టీఎంసీ అంటేనే అవినీతి. ఇక్కడికి వచ్చిన ప్రజలు ఇచ్చిన విశ్వాసంతో చెబుతున్నా.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే సర్కార్ 400 స్థానాల్లో విజయం సాధిస్తుంది. టీఎంసీ అంటే దౌర్జన్యాలు, కుటుంబ రాజకీయం, దోపిడీకి ప్రతిరూపం. బెంగాల్ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన పట్ల విసుగు చెందారు. సందేశ్‌ఖాలీ మహిళల విషయాన్ని ప్రస్తావిస్తూ... టీఎంసీ నేతలు సందేశ్‌ఖాలీ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని అన్నారు. బాధలో ఉన్న తల్లులు సోదరీమణులకు మద్దతు ఇవ్వాల్సింది పోయి టీఎంసీ ప్రభుత్వం నిందితుల పక్షాన నిలబడుతోందని మోదీ విమర్శించారు. న్యాయం కోసం సందేశ్‌ఖాలీ మహిళలు ఎంత వేడుకుంటున్నా, నిరసనలు తెలిపినా టీఎంసీ ప్రభుత్వం మాత్రం వినిపించుకోలేదని మోదీ మండిపడ్డారు.

## కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించండి

**టి ఎస్ ఎస్ పి డి సి ఎల్ సిఎండి ముషారఫ్ ని కలిసిన కాంట్రాక్టర్ల సంఘంద**
**వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పై పిఫో తొలగించాలని విజ్ఞప్తి**

హైదరాబాద్, మార్చి 2(ప్రభాత ఉదయం) విద్యుత్ సంస్థలో(టి ఎస్ ఎస్ పిడిసిఎల్) పనిచేస్తున్న కాంట్రాక్టర్లు తమ సమస్యలు పరిష్కరించాలని సంస్థ సీఎం డి ముషరఫ్ ఫారుఖీ నీ కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పై విధిస్తున్న పీఫో ను తొలగించాలని, డివిజన్ పరిధిలో 50 వేల నుండి పరిధిని లక్ష రూపాయల వరకు పెంచాలని ,ఎల్ సి ఇవ్వక పోవడంతో కాంట్రాక్టు పనులు ఆలస్యం జరుగుతున్నాయని, పి యం ఆర్డర్ లకు వర్కు అగ్రిమెంట్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. టి ఎస్ ఎస్ పి డి సి ఎల్ లో పని చేస్తున్న కాంట్రాక్టర్ల సంఘం అందించిన వినతిపత్రాన్ని పరిశీలించిన సి యం డి ముషారఫ్ ఫారూఖీ ఎల్ సి విషయంలో పరిశీలిస్తానన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు పీఫోను తక్షణం తొలగిస్తామని అదే విదంగా డి ఈ పరిధిలో ఇచ్చే బడ్జెట్ ను 50 వేల నుండి లక్ష కు పెంచుతామని సిఎండి హామీ ఇచ్చినట్లు కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు తెలిపారు. సిఎండి ముషారఫ్ ను కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి యస్ కే మాజిద్,ఆసిఫ్,పర్వతాలు,బి.ఇషాకి,కే.యాదయ్య, సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.



టిఎస్ఎస్ పీడీసీఎల్ సిఎండి ముషారఫ్‌కు సమస్యలు వివరిస్తున్న కాంట్రాక్టర్లు

## ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

మొదటి పేజీ తరువాయి...

ఇళ్ల స్థలాలు ఉన్న వారికి ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తుంది. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం, రూ. 5 లక్షల లబ్ధి చేకూరుతుంది. దశలవారీగా నిధుల విడుదలకు సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలను సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. లబ్ధిదారులకు అందాల్సిన నిధులు దుర్వినియోగం కాకుండా పక్కా మార్గదర్శకాలు రూపొందించాలని రేవంత్ అన్నారు. సొంత ప్లాట్‌లో ఇల్లు నిర్మించుకునే వారికి వివిధ రకాల ఇళ్ల నమూనాలు, డిజైన్లు అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి సూచించారు. గృహనిర్మాణ పథకం కింద ఇంటి నిర్మాణంలో వంటగది, మరుగుదొడ్డి ఉండేలా నిర్మించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తున్న వివిధ శాఖల్లోని ఇంజినీరింగ్ విభాగాలకు ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని రేవంత్ అధికారులకు సూచించారు.గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాల్లో చేసిన తప్పులు జరగకుండా .. అర్హులకు లబ్ధి జరిగేలా చూడాలని తెలిపారు. సమీక్షంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## డిపాజిటర్స్‌లో విశ్వాసం నెలకొల్పుటలో ఆధునీకరణ దిశగా అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు

మొదటి పేజీ తరువాయి...

అభివృద్ధి అనేక రెట్లు పెరుగుతుందన్నారు. ఎన్ యూ సీ ఎఫ్ డీ సీ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల సమస్యలను పరిష్కరించడానికి ప్రధాన సంస్థ గా పనిచేస్తుంది ఎన్ యూ సీ ఎఫ్ డీ సీ చిన్న బ్యాంకులకు రక్షణ కవచం, డిపాజిటర్ల విశ్వాసాన్ని పెంపొందిస్తుంది, రాబోయే రోజుల్లో పనిలో మరింత పురోగతిని నిర్ధారిస్తుంది. ఎన్ యూ సీ ఎఫ్ డీ సీ బ్యాంకుల సంక్షోభ సమయంలో మద్దతుగా ఉండటమే కాకుండా వాటి అభివృద్ధి, ఆధునీకరణ,సామర్థ్యాన్ని పెంపొందించే సాధనం అన్నారు.ఈ కార్యక్రమంలో కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి బి.ఎల్. వర్మ, సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశిష్ కుమార్ భూటానీతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ బిజెపి ఎంపీ అభ్యర్థిగా భరత్



మహబూబ్ నగర్, జిల్లా ప్రతినిధి,మార్చి 2(ప్రభాత ఉదయం) నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా సెట్టింగ్ ఎంపీ తనయుడు, కల్వకుర్తి జడ్పిటిసి భరత్ ను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ స్థానం నుండి పోటీ చేసేందుకు మొదటి నుండి బంగారు శృతి ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. అనూహ్యంగా సిట్టింగ్ ఎంపీ రాములు తన కుమారుడు భరత్ తో కలిసి మూడు రోజుల క్రితం భారతీయ జనతా పార్టీలో చేరారు. యువకుడు అయిన భరత్ కు నాగర్ కర్నూలు స్థానం కేటాయించడం వల్ల పార్టీ బలోపేతం కావడంతో పాటు గెలవడానికి అన్ని అవకాశాలు ఉంటాయి అని భావించి పార్టీ అధిష్టానం భరత్ కు అవకాశం కల్పించారు. భరత్ కు టికెట్ ఖరారు కావడంతో నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం లో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గం నుండి పోటీ చేసే అభ్యర్థిని ప్రకటించలేదు. ఈ స్థానం నుండి బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంత కుమార్ టికెట్ కోసం గట్టిగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అభ్యర్థి ఎంపిక ఇబ్బందికరంగా ఉండడంతో అధిష్టానం మొదటి జాబితాలో ఎంపిక చేయలేనట్టు తెలుస్తుంది. మొత్తం పై ముగ్గురిలో అవకాశం ఎవరికీ దక్కుతుందో అన్న అంశం రాజకీయ వర్గాలలో ఉత్కంఠ కలిగిస్తోంది.



చిన్నారికి పోలియో చుక్కల పంపిణీ

## నేడు పోలియో చుక్కల పంపిణీ

హైదరాబాద్, మార్చి2(ప్రభాత ఉదయం) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈనెల 3వ తేదీన పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువు మొదలుకొని ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికి వారి తల్లిదండ్రులు పోలియో చుక్కల పంపిణీ కేంద్రాల వద్దకు వెళ్లి పోలియో చుక్కలు వేయించాలని ప్రభుత్వ వర్గాలు కోరుతున్నాయి. పోలియో మహమ్మారిని తరిమి కొట్టడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు . 3వ తేదీ ఆదివారం పనుల ఒత్తిడి కారణంగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించలేని తల్లిదండ్రులు 4, 5వ తేదీల్లో తమ ఇండ్ల వద్దకు వచ్చే వైద్య సిబ్బంది ద్వారా పోలియో చుక్కలను వేయించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




విద్యార్థులను ప్రదర్శనలు అంశాలపై అడిగి తెలుసుకుంటున్న ఎస్ఆర్‌డిజి విద్యాసంస్థల జనరల్ మేనేజర్ అరుణ

## సైన్స్ ఫెయిర్ వల్ల విద్యార్థుల్లో ప్రతిభ

**ఎస్ ఆర్ డి జి సంస్థల డిప్యూటీ జనరల్ మేనేజర్ అరుణ**

కూకట్‌పల్లి, మార్చి 2 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి శుభోదయ కాలనీలోని ఎస్ ఆర్ డి జి స్కూల్లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ ఆర్ డి జి సంస్థల డిప్యూటీ జనరల్ మేనేజర్ అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే సైన్స్ ఫెయిర్ వల్ల విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసే అవకాశం కలుగుతుందని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు సైన్స్ పట్ల, ప్రకృతి పట్ల అవగాహన ఏర్పడడంలో సైన్స్ ఫెయిర్లు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ వీఆర్వోలు

## వీఆర్వోలను రెవెన్యూలోకి తీసుకోండి

**మంత్రి పొంగులేటినీ కోరిన వీఆర్వోలు**

హైదరాబాద్, మార్చి 2(ప్రభాత ఉదయం)రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని,వీఆర్వోలను తిరిగి తీసుకుంటే మేలు కలుగుతుందని ట్రెసా, వీఆర్వో జాక్ నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు.శనివారం మృతి చెందిన వీఆర్వోల స్థానంలో కారుణ్య నియామకాలు చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలని కోరారు.మంత్రికి విన్నపాలు:1.178 మంది వీఆర్వోల కుటుంబాలకు కారుణ్య నియామకం హర్షనీయమన్నారు. రెవెన్యూ శాఖలో వీఆర్వోలు , సిబ్బంది లేక ఇబ్బందులు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,.రెవెన్యూ శాఖలో అపారమైన అనుభవం శ్రమ పడే తత్వం ఉన్న వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకొచ్చి అర్హులైన వారందరికీ పదోన్నతి కల్పించి మిగతావారికి సమానమైన హోదాతో రెవెన్యూ శాఖలో కొనసాగించాలని కోరారు. భూప్రక్షాళన పెండింగ్ అప్లికేషన్ల పరిష్కారానికి రద్దయిన వీఆర్వోలందరినీ ప్రస్తుతం డిప్యూటేషన్ మీద రెవెన్యూ శాఖలోకి తీసుకువస్తే సమస్యలు పరిష్కారానికి సులభ మౌతుందన్నారు.భూ సమస్యల పరిష్కారానికి ఇతర శాఖల ఉద్యోగులను ఉపయోగించుకోవడంలో మేలు జరగదు వారికి భూ చట్టాల గురించి భూ రికార్డుల గురించి అనుభవం లేదు మరలా తప్పులు జరిగే అవకాశాలు ఉంటాయని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. ఇతర శాఖలో బదిలీ అయినా వీఆర్వోలు అనేక ఇబ్బందులకు గురి అవుతూ,కొంతమందికి జీతాలు రాక ఇబ్బందులు ఎదురుకుంటున్నారు.మంత్రిని కలిసిన వారిలో ట్రెసా రాష్ట్ర అధ్యక్ష్య,కార్యదర్శులు వంగ రవీందర్ రెడ్డి,కే.గౌతమ్ కుమార్,వీఆర్వో జాక్ చైర్మన్ గోల్కొండ సతీష్ ఉన్నారు.

## పిఆర్‌టియు తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షుడుగా భరత్ కుమార్



గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి2(ప్రభాత ఉదయం) పి ఆర్ టి యు జోగులాంబ గద్వాల జిల్లా గౌరవ అధ్యక్షుడు గా మల్దకల్ మండలం బిజ్వారం పాఠశాల లో పనిచేస్తున్న జి భరత్ కుమార్ ను నియమించినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ప్రకటించారు.భరత్ కుమార్ నియామకం పట్ల జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి సాతర్ల రఘు, హర్షం వ్యక్తం చేశారు. భరత్ కుమార్ మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తమ సంఘం ముందు ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందని సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు.

# చిన్న అనంతగిరి దేవాలయంలో 49వ మహాశివరాత్రి వేడుకలు

### ఏర్పాట్లను సిద్ధం చేసిన ప్రణవభక్త సమాజం

రాజేంద్రనగర్, మార్చి 2 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ చిన్న అనంతగిరి శివాలయం 49వ మహా శివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మోంద్ర నరసింహ తెలిపారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులు మహాశివరాత్రి వేడుకలకు సంబంధించిన గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం ఉదయం 7:30 గంటల నుండి శివాలయంలోని అమ్మవారి ఆలయం వద్ద గజ స్తంభాన్ని పునర్నిర్మాణం చేయనున్న సందర్భంగా ఉదయాన్నే పూజా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రణవ భక్త సమాజం కమిటీ సభ్యులు తెలిపారు. మార్చ్ 7 వ తేదీ నుండి 9 తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నరు. మహాశివరాత్రి రోజున 50 వేల నుండి లక్ష మంది వరకు భక్తులు ఆలయానికి వస్తారని అన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల ఇలాంటి ఇబ్బందుల గురి కాకుండా తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. శివరాత్రి 8 తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అభిషేకాలు నిర్వహిస్తామని, 9వ తేదీన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, అశోక్, హరినాథ్, అయిలయ్య, కిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.


శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ను విడుదల చేస్తున్న ప్రణవభక్త సమాజం ప్రతినిధులు


బుద్వేల్ అరుంధతి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న శ్రీ కుసుమ హరనాథ బాబా మందిర కమిటీ ప్రతినిధులు

# బుద్వేల్ అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి సన్మానం

బుద్వేల్ అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం శ్రీ కుసుమ హరనాథ బాబా మందిర కమిటీ సభ్యులు సన్మానించారు. అరుంధతీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోరని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కోరని రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కోరని వరప్రసాద్, సంయుక్త కార్యదర్శి మంచాల నరేష్ , కోశాధికారి గోల్కొండ మోహన్ చందు లు సన్మానం అందుకున్న వారిలో ఉన్నారు. సన్మానించిన వారిలో శ్రీ కుసుమ హరనాథ బాబా మందిరం కమిటీ అధ్యక్షుడు కె. శ్రీనివాస్ గౌడ్ , ఉపాధ్యక్షుడు ఎస్ కె నజీర్, ప్రధాన కార్యదర్శి జి హరికిరణ్ గౌడ్, కోశాధికారి కోడిగంటి శేఖర్ రెడ్డి , మూల రమేష్ గౌడ్, బి శంకర్ చారి , పుజాల గిరి గౌడ్ , బి గోపాల్, డి అరవింద్ కుమార్ , నిరంజన్ గౌడ్ , మూల సంతోష్ గౌడ్, రమేష్ నాయిని, జి రవి కిరణ్ గౌడ్ , వెంకటేష్ సాగర్ , డి. దశరథ్ , ఎం నాగరాజు, రత్నాచారి, ఎ. శివకుమార్ యాదవ్ , ఈశ్వర్, దుర్గా సాయి , గోవర్ధన్ రెడ్డి , శ్రీకాంత్ నాయి తదితరులు ఉన్నారు.

# టైనీ స్కాలర్స్ హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు


రాజేంద్రనగర్ ఎం ఈ ఓ రామిరెడ్డిని సన్మానిస్తున్న టైనీ స్కాలర్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ కె. నాగ సీత. చిత్రంలో రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం ప్రధాన కార్యదర్శి జి. శరవన్ కుమార్


తన ప్రదర్శనతో 7వ తరగతి కి చెందిన అక్షయ్

బుద్వేల్, మార్చి2(ప్రభాత ఉదయం): సైన్స్ ఫెయిర్‌లు నిర్వహించడం వలన విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీయవచ్చు అని రాజేంద్రనగర్ ఎంఈఓ రామ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదర్ గూడ లోని టైనీ స్కాలర్ హై స్కూల్ లో ప్రిన్సిపాల్ కె. నాగ సీత ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ రామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఉరుకుల, పరుగుల జీవితంలో విద్యార్థులు కష్ట పడి చదవాల్సిన అవసరం ఉందన్నారు. నిరంతరం చదువుకునే విద్యార్థులు మన శాస్త్రవేత్తల గురించి తెలుసుకోవడం మంచిదన్నారు. తీరిక దొరికినప్పుడల్లా తమ నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. విద్యార్థులు సెల్ ఫోన్లు వాడుతున్నారని, వాటికి దూరంగా ఉండి పుస్తకాలు చదవాలన్నారు. సెల్ ఫోన్లు కేవలం సమాచారం కోసమే వినియోగించాలని ఎక్కువ సమయం సెల్ ఫోన్ లో గడపడం ద్వారా ముందు ముందు వారి భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని గుర్తు చేశారు. మనకు అవసరం మేరకే సెల్ ఫోన్ లు వాడాలని తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థుల ప్రదర్శన లను ఆయన తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. నాగ సీత , నిర్వాహకులు కె. శ్రీనివాసరావు , గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాల యాజమాన్య సంఘం ప్రధాన కార్యదర్శి జి శరవన్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఉప్పర్‌పల్లి హైదర్ ఎన్క్లేవ్ వద్ద మూసీపై నిర్మించిన అక్రమ నిర్మాణాలు కూల్చివేతలు

# మూసి పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను సహించేది లేదు

### తహసిల్దార్ బి. రాములు హెచ్చరిక

బుద్వేల్, మార్చి2(ప్రభాత ఉదయం) : మూసి పరివాహక ప్రాంతాలలో, చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ తహసీల్దార్ బి. రాములు తెలిపారు. ఉప్పర్ పల్లి హైదర్ ఎంక్లేవ్ ప్రాంతంలో మూసి పరివాహక స్థలంలో నిర్మించిన ఆరు అక్రమ నిర్మాణాలను శనివారం రెవెన్యూ, జిహెచ్ఎంసి, మూసి డెవలప్మెంట్ అధికారులు భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చి వేశారు. అనంతరం తహసీల్దార్ బి రాములు మాట్లాడుతూ, మూసి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలను రూపకల్పన చేస్తున్నదని గుర్తు చేశారు. ఎవరైనా మూసి పరివాహక ప్రాంతంలో స్థలాలు కొనుగోలు చేసినట్లయితే వారు ఆర్థికంగా ఇబ్బందుల్లో పడతారన్నారు. మూసి పరివాహక ప్రాంతంలో ఎలాంటి అక్రమ నిర్మాణాలను సహించేది లేదని హెచ్చరించారు.

# గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా పి అర్చన జయప్రకాష్



బుద్వేల్, మార్చి2(ప్రభాత ఉదయం):గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్( జిహెచ్ఎంసి) స్టాండింగ్ కమిటీ సభ్యురాలుగా రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పొడవు అర్చన జయప్రకాష్ నియమితులయ్యారు. ఈమెరకు గ్రేటర్ కమిషనర్ డి రోనాల్డ్ రోస్ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా పి అర్చన జయప్రకాష్ మాట్లాడుతూ, తన నియామకానికి కృషి చేసిన బీ ఆర్ ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షులు కేటీఆర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యురాలుగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ లో అభివృద్ధి పనుల మంజూరుకు స్టాండింగ్ కమిటీలో మాట్లాడి నిధులను ఇప్పించే విధంగా చూస్తానన్నారు. ఇప్పటివరకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ సహకారంతో డివిజన్ లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో డివిజన్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇచ్చి ముందుకు సాగుతామన్నారు.



# శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర

### శివరాత్రి వరకు వెళ్లేలా ప్రణాళిక

### ఐదు రోజులపాటు 200 కిలోమీటర్ల పాదయాత్ర

రాజేంద్రనగర్, మార్చి 2 (ప్రభాత ఉదయం): ఓం నమఃశివాయ.. శివోహం.. వస్తున్నాం మల్లన్నా.. అంటూ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్ పహాడ్ శివాంజనేయ స్వామి దేవాలయంలో శివనామస్మరణతో మారుమోగింది. శివ నామ స్మరణ చేస్తూ%ొా%.. గగన్ పహాడ్ నుంచి శ్రీశైలంకు స్వాములు పాదయాత్ర చేస్తూ మల్లికార్జున స్వామి దర్శించుకుంటారు. గోవర్ధన్ రెడ్డి, శివారెడ్డి గురుస్వాములు ఇరుముడులు కట్టి పూజలు చేయగా, మ హిళలలు మంగళ హారతులు, శరణుఘోషల మధ్య స్వాములు పాదయాత్రకు తరలివెళ్లారు. శివాంజనేయ దేవాలయం నుంచి ప్రతి ఏటా శివ స్వాములు శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు ఇరుముడులతో పాదయాత్రగా వెళ్లడం అనవాయితిగా మారింది. శివ స్వాములు ఐదు రోజులపాటు దాదాపు 200 కిలోమీటర్లు పాదయాత్ర చేసి మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. అన్నిదారులు శ్రీశైలం వైపే వెళు_న్నాయి. ఈ నెల 8 న మహా శివరాత్రి సందర్భంగా అప్పటి వరకు క్షేత్రానికి చేరుకోవాలని శివ స్వాములు కాలినడకన తరలి వెళ్తున్నారు. శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరిన స్వాములలో అభిరామ్, భీమ్ రెడ్డి, మోను నాయక్, శ్రావణ్, చింటు రెడ్డి, వంశీ రెడ్డి, రాజు, శివమణి, నాగరాజు, కేశవులు, రవి, సన్నీ, శివసాగర్, రాము, కాశీ, నాగరాజు, హరీష్ తదితరులు ఉన్నారు.

**ప్రతి ఏటా దర్శించుకుంటాం...శివా రెడ్డి గురుస్వామి**

శివదీక్ష తీసుకుంటే అంతా మంచి జరుగుతుంది. శివుని దర్శించుకోవడం వల్ల ఎంతో పుణ్యం వస్తుంది. ప్రతి సంవత్సరం శివరాత్రి వరకు శివుడిని దర్శించుకుంటాం. శివుడిని తల్చుకుంటే చాలు నొప్పులు, బాధలన్నీ పోతాయి. మేము 25 మందితో కలిసి శ్రీశైలం పాదయాత్రగా వెళ్తున్నాం.

# ఈత కొడుతూ ఊపిరాడక ఓ వ్యక్తి మృతి


సతీష్ కుమార్ మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

బుద్వేల్, మార్చి2(ప్రభాత ఉదయం) : ఈత కోసం ఈసా నదిలోకి దిగిన ఓ వ్యక్తి ఊపిరాడక మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం కిస్మత్పూర్ బాబమ్మ కాలనీ వెనకాల గల ఈసా నదిలో జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి . కిస్మత్పూర్ కు చెందిన కుమార్ రెండవ కుమారుడు సతీష్ కుమార్ (35) వివాహితుడు. డ్రైవర్ గా పనిచేస్తాడు. భార్య సంగీత , ఇద్దరు పిల్లలు ఉన్నారు . సతీష్ కుమార్ శనివారం మధ్యాహ్నం తండ్రి కుమార్ , స్నేహితుడు బాలకృష్ణతో కలిసి బాబమ్మ కాలనీ వెనకాల గల తమ పొలం వద్దకు వెళ్లారు . ఆ తర్వాత ఈసా నదిలో ఈత కోసం సతీష్ కుమార్ దిగాడు. కాలువ అవతలికి ...ఇవతలికి ఈదుతూ నీటిలో మునిగిపోయి మరణించాడు. కళ్ళముందే కన్న కొడుకు నీళ్లలో మునిగిపోవడం చూసిన తండ్రి కుమార్ తల్లడిల్లి పోయారు . కొడుకును బయటకు తీసి రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు . ఎస్సై రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. సతీష్ కుమార్ సోదరుడు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


సతీష్ కుమార్ (ఫైల్ ఫోటో)


నూతన మైనార్టీ కార్పొరేషన్ల చైర్మన్‌లతో సీఎం రేవంత్ రెడ్డి

# మూడు కార్పొరేషన్ చైర్మన్‌లను ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి

హైద్రాబాద్,మార్చి2(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూడు కార్పొరేషన్ చైర్మన్లను ప్రకటించింది. శనివారం ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ ల నియామక ఫైల్ పై సంతకం చేశారు. మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ గా ఓబెదుల్లా కొత్వాల్,ఉర్దూ అకాడమీ చైర్మెన్ గా తహెర్ బిన్ అందాని,క్రిష్టియన్ మైనారిటీ ఛైర్మన్ గా దీపక్ జాన్ నియమితులయ్యారు. నూతన కార్పొరేషన్ చైర్మన్లు సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

# విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో దోహదం

### పడమటి శ్రీధర్ రెడ్డి

**ఆరాధన ఉన్నత పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫెయిర్..**

**ఆకట్టుకున్న పిల్లల ప్రాజెక్ట్ వర్క్స్**


విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న పడమటి శ్రీధర్ రెడ్డి

రాజేంద్రనగర్, మార్చి 2 (ప్రభాత ఉదయం): విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో దోహదపడతాయని బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, శివరాంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ మేనేజ్మెంట్ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీ లోని ఆరాధన ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ ఫెయిర్ అట్టహాసంగా నిర్వహించారు. సైన్స్ ఫెయిర్ లో పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులు పలు రకాల ప్రాజెక్ట్ వర్క్స్‌ను సొంతంగా తయారు చేసిన ప్రదర్శనలో వాటి పనితీరును తోటి విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించారు. సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పడమటి శ్రీధర్ రెడ్డి విద్యార్థులు తయారుచేసిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పిల్లల మనో వికాసానికి సైన్స్ ఫెయిర్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థులంతా సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని నూతన సైన్స్ రంగంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు.ప్రాజెక్ట్ వర్క్స్ చేసి, వాటి పనితీరును వివరిస్తూ.. అందరిచేత విద్యార్థులు ప్రశంసలు పొందారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్ చారి, శరవన్ కుమార్, రజనీకాంత్, నాయకులు మాడూరి ప్రభాకర్ రెడ్డి, జీవన్ దాస్, పాఠశాల కరస్పాండెంట్ మనోహర్, నాగని సురేష్, కరుణాకర్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు, విద్య కమిషన్ల ఏర్పాటుపై హర్షం

### నూతన సంస్కరణలతో రైతులకు ఎంతో మేలు

### జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి



కొత్తకోట, మార్చి2(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో రైతు కమిషన్, విద్యారంగంపై కమిషన్ ను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల వనపర్తి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సుపరిపాలనను ప్రజల చెంతకు చేర్చేందుకు వ్యవసాయ శాఖ, విద్యా శాఖలో కొత్త సంస్కరణలను ప్రవేశపెట్టి రైతులు, కౌలు రైతుల సాధకబాధకాలు, విద్యావ్యవస్థలో సమస్యలను పరిష్కరించడం కోసం కమిషన్ లో ఏర్పాటుతో తగిన సలహాలు, సూచనలు అందిస్తూ అభివృద్ధి వైపు ప్రయాణింప చేస్తుందన్నారు. కౌలు రైతుల రక్షణకు సంబంధించి ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆలోచన విధానాన్ని స్వాగతిస్తున్నామ న్నారు. అసలైన అర్హులకు పంటలు వేసే రైతులకు రైతు భరోసా అనేది పెట్టుబడి సాయం ఇవ్వాలన్న దానిపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. పంట మార్పిడికి, పంటల విస్తీర్ణకు ప్రాధాన్యం ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు దన్నుగా నిలుస్తూ ఈ రంగాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నాం. సాగు రంగంలో ప్రతికూలతలను తట్టుకుంటూ రైతులకు రక్షణగా నిలిచేందుకు వచ్చే పంట కాలం నుంచి పంటల బీమా పథకం ద్వారా రైతుల ప్రయోజనం పొందడానికి కృషి చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు . అదే విధంగా ధరణి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం ఉమ్మడి జిల్లాలో వేలకొద్దీ ధరణి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్పొరేట్ విద్యకు కట్టడి చేసి ప్రతి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులం ఒకే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం తెల్పడంపట్ల హర్షం ఆయన వ్యక్తం చేశారు.



వేషధారణలో విద్యార్థినీ, విద్యార్థులు





కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి



వేషాదరణలో చిన్నారి

# విద్యార్థులు విద్యాదశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

గద్వాల ,మార్చి 2(ప్రభాత ఉదయం) విద్యార్థులు విద్యాదశ నుంచే క్రమశిక్షణతో ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవడానికి అర్హత సాధిస్తారని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శనివారం గద్వాల పట్టణంలోని విశ్వం శ్రీఅక్షర కాంసెప్ట్ వార్షికోత్సవ వేడుకలను జమ్మిచేడులోని సివిఎస్ జీ ఫంక్షన్ హాల్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెట్టే విధంగా నడవడిక ఉ ఒడాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా సాగాయి. ఈ కార్యక్రమంలో గట్టు ఎంపీపీ విజయ్‌కుమార్, కేటిదొడ్డి వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, జిల్లా గ్రంథాల శాఖ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, విశ్వం విద్యాసంస్థల అధినేత పి.శ్రీధర్, ప్రిన్సిపల్ రత్నం, ఉ పాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# రెండు కోట్ల రైతు బీమా, రైతు బంధు స్వాహా

## గోప్యంగానే విచారణ... మీడియాకు వివరాలు వెల్లడించని వ్యవసాయ అధికారులు

మహబూబ్ నగర్, మార్చి2(ప్రభాత ఉదయం)గత బిఆర్ఎస్ ప్రభుత్వం అన్నదాతల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రైతుబంధు, రైతుబీమా పథకాలను అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్రావు అందుబాటులోకి తీసుకవచ్చారు. అమాయక అన్నదాతలను ఆసరగా చేసుకొని అధికారులు, మద్యవర్తులు కుమ్మక్కై అన్నదాతలను మోసం చేస్తూ అందినకాడికి నిధులను కాజేస్తున్నారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల పరిధిలోని అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గోరెటి శ్రీశైలం గ్రామాల్లో ఉన్న రైతుల పేరిట నకిలీ డెత్ సర్టిఫికెట్లతో రైతు బీమాకు దరఖాస్తు చేసుకొని ఘరానా మోసానికి పాల్పడి ప్రభుత్వ ఖజానా నుంచి రూ.2 కోట్లు స్వాహా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. అదే తరహాలో జోగులాంబ గద్వాల జిల్లాలో గట్టు మండలం బల్గెర క్లస్టర్ పరిధిలోని ఓ వ్యవసాయ విస్తరణ అధికారి(ఎఇఓ) బల్గెర క్లస్టర్ పరిధిలోని బల్గెర, ముస్లింపల్లి, మల్లంపల్లి, చమాన్ ఖాన్ దొడ్డి గ్రామాలల్లో పొలాలుండి ఊర్లు వదిలి వెళ్లిన వారి రైతుల సర్వే నంబర్ల ఆదారంగా రైతుబంధు పథకంలో బినామీలు ఆకౌంట్లను జత చేయించి పెట్టుబడి సాయాన్ని స్వాహా చేశారు. 64 మంది రైతులకు చెందిన సుమారు రూ. 141.23 ఎకరాల పంట పెట్టుబడి సహాయాన్ని రూ.36.06లక్షలు బినామి అకౌంట్ లోకి పక్కదారి పట్టించడంతో ఎఇఓను సస్పెండ్ చేశారు. ప్రభుత్వం నుంచి రైతులకు అందిస్తున్న పంట పెట్టుబడి సాయం ఎన్నో సంవత్సరాల నుండి లబ్దిదారులకు అందకపోవడంతో అధికారుల దృష్టి తీసుకెళ్లకపోవడం కొసమెరుపు. ఓ బాధిత రైతు రాష్ట్ర వ్యవసాయ కమీషనర్ కు ఫిర్యాదు వేస్తే రైతుబంధు పక్కదారి పట్టిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో జిల్లా వ్యవసాయ అధికారులు విచారణ చేపట్టగా 64 మంది రైతుల రైతు బంధు సాయం 52 మంది బినామీల ఆకౌంట్లను జత చేయించి రూ.36.06లక్షలు కాజేసినట్లు విచారణలో తేలింది. ఈ 52 మంది బినామీ అకౌంట్లు ఎవరివనీ తేలాల్సి ఉంది? బినామీ అకౌంట్లో జమ అయిన నగదు తిరిగి ఇతరుల అకౌంట్లోకి బదిలీ చేశారా? లేక నగదు డ్రా చేసి అందరు వాటాలు పంచుకున్నారా అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు. కాజేసిన రైతు బంధు నగదు ఎవరెవరికీ పంపిణీ చేశారూ? రైతుబంధు కాజేయండలో ఎంత మంది పాత్ర ఉంది? అనేక ప్రశ్నలు ఇంకా ప్రశ్నగానే మిగిలిపోయాయి. గట్టు మండలంలో బాధిత రైతులు అధికారులకు ఫిర్యాదు చేయకుండా అందరిని మేనేజ్ చేసినట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే బాధితులకు కొంతడబ్బు అందజేసినట్లు వినికిడి. కాగ గట్టు మండలంలోని పలు ఆన్ లైన్ సెంటర్ నిర్వాహకుల పాత్ర ఇందులో ఉందని, ఎఇఓతో వారికి సన్నిహిత సంబంధాలున్నాయని, గ్రామాలలో పొల్లాలు ఉండి గ్రామాలను వదిలి వేసిన రైతులు, మృతి చెందిన రైతుల వివరాలు పక్క సేకరించి రైతుబంధు డబ్బులు పక్కదారి పట్టడంలో వారి పాత్ర ఉన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కాజేసిన డబ్బులు వ్యవసాయ ఉన్నతాధికారులకు హ్యాండ్ ఓవర్ చేయడానికి ఎఇఓ సిద్దంగా ఉన్నట్లు సమాచారం. ఇది ఇలా ఉండగా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన అధికారిపై సస్పెన్షన్ విధించారు కాని తదుపరి చర్యలకు తీసుకునేందుకు అధికారులు ఎందుకు వెనుకాడుతున్నారు అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి? రాష్ట్ర వ్యవసాయ కమీషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారా అనే సందిగ్దత ప్రస్తుత్తం నెలకొంది. ఎంక్వైరీ కమిటి వేసి లోతుగా విచారణ జరిపి రైతు బంధు పక్కదారి పట్టిన వారిపై చర్యలు తీసుకోకుండా, సంబంధిత అధికారిణి కాపాడేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రీకవరీ చేసిన అమౌంట్ ను ప్రభుత్వానికి అప్పజెప్పి చట్టపరంగా చర్యలు తీసుకొని ఇక ముందు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతోంది.



కళ్లకు గంతలు కట్టుకుని ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న ఇంద్రజాలిక మిత్రులు

# కళ్లకు గంతలతో ద్విచక్రవాహనాలతో.. అయోధ్య రాముని చెంతకు

## 8 రోజులు... 1,600 కిలోమీటర్లు లక్ష్యాన్ని చేరుకున్న ఇద్దరు ఇంద్రజాలికులు

హైదరాబాద్,మార్చి2(ప్రభాత ఉదయం) హైదరాబాద్ నగరానికి చెందిన ఇద్దరు ఇంద్రజాలికులు వినూత్న ప్రయత్నం చేశారు.కళ్లకు గంతలు కట్టుకుని, 8 రోజులు ద్విచక్ర వాహనంపై సుమారు 1,600 కిలోమీటర్లు ప్రయాణించి, అయోధ్య బాలరాముడిని దర్శించుకుని అనుకున్న లక్ష్యం సాధించారు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన మారుతిజోషి, సరూర్‌నగర్‌కు చెందిన రామకృష్ణ మిత్రులు.. ఇద్దరూ ఇంద్రజాలికులే. మారుతి బ్యాంకు ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూ సమయం దొరికినప్పుడల్లా మ్యాజిక్ షోలు చేస్తుండగా, రామకృష్ణ పూర్తిస్థాయి మెజీషియన్‌గా ప్రదర్శనలు ఇస్తున్నారు. రామభక్తుడైన మారుతిజోషి అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో బాలరాముడిని దర్శించుకోవాలని అనుకున్నారు. ఈ నేపథ్యంలోనే భక్తిని వినూత్నంగా ప్రదర్శిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాలని భావించారు. అందుకే కళ్లకు గంతలు, ముసుగు వేసుకొని ద్విచక్ర వాహనంపై అయోధ్య చేరుకోవాలని సంకల్పించారు. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా, ప్రమాదకర ప్రయాణం వద్దని వారించారు. స్నేహితుడు రామకృష్ణ మారుతితో కలిసి వెళ్తానని చెప్పడంతో అంతా ఒప్పుకొన్నారు. ఇలా ఫిబ్రవరి 23న ముచ్చింతల్‌లో చినజీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకొని యాత్ర ప్రారంభించారు. తొలిరోజు ముచ్చింతల్ నుంచి కామారెడ్డి అటు నుంచి ఆదిలాబాద్, నాగ్‌పుర్, సియోన్, లతందాన్, మంగమాన్, కాశీ తర్వాత శుక్రవారం రాత్రి అయోధ్య చేరుకొని రాముడిని దర్శించుకున్నారు. దారిపొడవునా రామభక్తులు, ప్రజాప్రతినిధులు అభినందిస్తూ ముందుకు సాగనంపారని మారుతిజోషి తెలిపారు. ఆశ్రమాల్లో బస చేస్తూ ముందుకు సాగినట్టు తెలిపారు. కళ్లకు గంతలతో వాహనం నడిపేందుకు నెల రోజులు సాధన చేశామని ఆ తర్వాతే యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు.

# అలంకార ప్రాయంగా మారిన మిషన్ భగీరథ కనెక్షన్‌లు



నీటి సరఫరా లేక వృధాగా నల్లా

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి2(ప్రభాత ఉదయం)గట్టు మండలం లోని బల్గెర గ్రామంలో తాగునీటి సమస్య వెంటాడుతోంది. కొంతకాలం గా ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్ లు అలంకార ప్రాయంగా మారాయి. బల్గెర గ్రామంలో 1,200 పైగా కుటుంబాలున్నాయి. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు ఇంటింటికీ భగీరథ నీటిని సప్లై చేయడానికి కుళాయిలు ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ నీళ్లు తగిన మోతాదు లో రాకపోవడంతో ట్యాంకుల్లో పైకి నీళ్లు ఎక్కటం లేదు. భగీరథ నీళ్లు వచ్చినా ట్యాంకులు పూర్తిగా నిండటం లేదు. దీంతో గ్రామంలో కొన్ని కాలనీలలో త్రాగునీటి సరఫరా నిలిచిపోయింది. బల్గెర గ్రామ పంచాయతీ పరిధిలోని 5వార్డులోని కుమ్మరి గేరి, పెద్దమ్మ గుడి 1వ వార్డు దిగంబర కాలనీలో గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. సుమారు వందకు పైగా కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. మిషన్ భగీరథ కనెక్షన్‌లు ఉన్నా త్రాగు నీటి సరఫరా అందడం లేదని దీంతో సమీపంలో ఉన్న చేతి పంపులు, బావుల నుంచి త్రాగు నీరు తెచ్చుకుంటున్నట్లు కాలనీవాసులు తెలిపారు. తాగునీటి సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా అంతా వేడుకుంటున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ ను వివరణ కోరగా...మిషన్ భగీరథ నీళ్లు తగిన మోతాదులో రాకపోవడం తో గ్రామంలో కొన్ని కాలనీలలో మోతాదు నీళ్లు సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు. గ్రామంలో తాగు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# రంగాదాముని చెరువును అత్యంత సుందరంగా తీర్చిద్దిద్దాలి

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



అధికారులతో కలసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, మార్చి 2 (ప్రభాత ఉదయం) రంగాదాముని చెరువు సుందరీ కరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కూకట్ పల్లి లోని రంగదాముని చెరువు పనులను అన్ని విభాగాల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెరువు అభివృద్ధి కొరకు రూ.19 కోట్లు కేటాయించామని చెరువు చుట్టూ ప్రజలకు ఉపయోగ పడే విధంగా వాక్ ట్రాక్, పార్క్ తో పాటు విద్యుత్ దీపాలతో సుందరీకరణ చేసేందుకు ప్రణాళిక చేశామని ఇప్పటికే సగం పనులు పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఏమైనా ఇబ్బంది ఉంటే తనకు తెలపాలని, అంతే కానీ పనుల్లో జాప్యం చేయొద్దని సూచించారు. తనను మూడోసారి అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు మౌలిక సదుపాయాల విషయంలో ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ప్రతినిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమం లో జలమండలి జిఎం ప్రభాకర్,మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, హెచ్ ఎం డి ఎ రెవెన్యూ, జి హెచ్ ఎం సి ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్‌సి సేవల ముసుగులో ఆధార్ సేవలు

## గుర్తింపు లేని ఆధార్ ఐడీల నుంచి ఆధార నమోదు కార్యకలపాలు

## థర్డ్ పార్టీ (ప్రైవేటు ఏజెన్సీల) ద్వారా ఆధార్ సేవలు నమోదు





మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి,మార్చి2(ప్రభాత ఉదయం)దేశంలోని గ్రామీణ , మారుమూల ప్రాంతాల్లోని పౌరులకు సేవలను అందించడంతో పాటు, అవసరమైన ప్రజా వినియోగ సేవలు, సాంఘిక సంక్షేమ పథకాలు, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక, విద్య , వ్యవసాయ సేవలను అందించడానికి సిఎస్‌సి కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో 300 సిఎస్ సి కేంద్రాలున్నట్లు సమాచారం. అయితే ఇటీవల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డు తప్పనిసరైంది. దీంతో ఐజ,మిట్టదొడ్డి,ఉండవల్లి, రాజోలి, చెనుగొనిపల్లిలో ఉన్న సీఎస్ సి సెంటర్ లకు ఆధార్ లోని కొన్ని సేవలు నమోదు చేయడానికి అనుమతులు ఇచ్చినట్లు జిల్లా సిఎస్సి మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. కాగ ప్రజల ఇబ్బందులను ఆసరాగా చేసుకొని కొందరు సిఎస్సీ నిర్వాహకులు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని మారుమూల గ్రామాలలో గల సిఎస్ సి సెంటర్ నిర్వాహకులు పలు అన్ ఆథరైజ్డ్ ఆధార్ ఐడీల ద్వారా కొత్తగా ఆధార్ కార్డు తీయటం కాని, ఆధార్ లో వయస్సుతో పాటు తదితర మార్పులు చేసి ప్రజల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు దోచుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సిఎస్ సి సెంటర్ లో ఎలాంటి అనుమతులు లేకున్నా ప్రైవేటు ఏజెన్సీ ద్వారా సేకరించిన ఆధార్ ఐడి నుంచి ఆధార్ నమోదు సేవలందిస్తున్నారు. కల్యాణ లక్ష్మీ పథకం అర్హత కోసం ఆధార్ లో వయస్సు తక్కువగా ఉంటే ఎలాంటి ధృవపత్రాలు లేకుండా ఆధార్ లో సంక్షేమ పథకానికి అనుగుణంగా వయస్సు, మార్పులు చేర్పులు చేసి వేల రుపాయాలు వసూళ్లు చేస్తున్నారు. సాధారణంగా బర్త్ సర్టిఫికెట్ , చదువుకున్న పాఠశాల బోనఫైడ్ ఆధారంగా ఆధార్ లో మార్పులు చేర్పులు చేయాలి కాని అందుకు విరుద్ధంగా నిర్వాహకులు చేయడం విశేషం. మారుమూల గ్రామాలలో ఉండటంతో అధికారుల పర్యవేక్షణ కరువైందని, ఆధార్ సెంటర్ లలో అందించిన సేవలు సిఎస్సీ సెంటర్ లలో అక్రమంగా అందిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మున్షిదాస్ కు వినతి పత్రం అందజేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

# దీపాదాస్ మున్షీని కలిసిన సీనియర్ కాంగ్రెస్ నేత డాకా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

## మల్కాజ్ గిరి ఎంపీగా పోటీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

కూకట్‌పల్లి, మార్చి 2 (ప్రభాత ఉదయం) మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాకా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్ మున్షీని శనివారం కలిసి విజ్ఞప్తిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరుణంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. 40 ఏళ్లుగా తాను కాంగ్రెస్ పార్టీలో ఎన్.ఎస్.యు. ఐ, యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలో వివిధ హెూదాల్లో పనిచేశానని దీపా దాస్ మున్షీకి వివరించారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరడంతో దీపా దాస్ మున్షీ సానుకూలంగా స్పందించి కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉ ంటుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాకా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోందని ఇందులో భాగంగానే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ఆరు హామీలను హామీ ఇచ్చిన నేపథ్యంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం 17 సీట్లలో 16 పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని దేశంలో సైతం అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలుపొంది రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



సైన్స్ ఫెయిర్ ను తిలకిస్తున్న చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి

# విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

## కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి

కూకట్‌పల్లి, మార్చి 2 (ప్రభాత ఉదయం) పాపిరెడ్డి నగర్ లోని రాజధాని హై స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్ గుప్తా ఆహ్వానం మేరకు నేషనల్ మెగా ఆర్ట్ అండ్ సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని శనివారం పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రోత్సహించడం వలన పిల్లలు ఎంతో చురుకుగా ఉండడమే కాకుండా భవిష్యత్తులో వారికంటూ లక్ష్యాన్ని ఏర్పరచుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా రాజధాని హై స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్ గుప్తా శ్రీధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మాయ నరసయ్యలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలియో మహమ్మారిని తరిమి కొడదాం: ఎంపీపీ ప్రహ్లాద రెడ్డి

**అయిజ, మార్చి2(ప్రభాత ఉదయం) పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు ఆదివారం నుండి ప్రారంభమయ్యే పల్స్ పోలియో కార్యక్రమంలో 0 నుండి 5 ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పక వేయించాలని అయిజ ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తులో ఎవరు కూడా పోలియో బారిన పడరాదన్నా ఉద్దేశంతో మార్చి3, 4 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియా కార్యక్రమాని విజయవంతం చేయాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు వేస్తారన్నారు. మండల పరిధిలోని ఆ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ కోరారు.**



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.